ఇల్లందకుంట, అక్టోబరు 6: మండలంలోని బూజూనూర్ గ్రామచెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందినవారు బతుకమ్మ చెరువు సమీపం గుండా ఆదివారం వెళ్తుండగా చెరువులో మృతదేహం కనబడింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి 35-45సంవత్సరాల వయస్సు ఉంటుంది. కుడి చేతికి స్టీల్ కడెం, చామన్‌చాయ రంగుతో పాటు బ్లూ కలర్ ఫుల్ టీషర్ట్ ఉంది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినట్లయితే 8712670778 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి

మానకొండూర్, అక్టోబరు 6: మండలంలోని కెల్లేడు గ్రామ శివారులో విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టేందుకు విద్యుత్ స్తంభం ఎక్కిన అసిస్టెంట్ లైన్‌మెన్ జోగు నరేష్ విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందాడు. కొండపల్కల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కెల్లేడు గ్రామ శివారులో 33బై11 కేవి విద్యుత్ లైన్ పనులను మరమ్మతు పనులు చేసేందుకు ఆదివారం విద్యుత్ స్తంభం ఎక్కాడు. విద్యుత్ సరఫరా కొనసాగుతుండడంతో విద్యుదాఘాతంతో స్తంభం పైనుంచి పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



నరేష్ (ఫైల్)

దైవ దర్శనానికి వెళ్తూ అనంతలోకాలకు..

- ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 6: మండలంలోని దేవునిపల్లి లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భార్యతో కలిసి వెళ్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వేముల లక్ష్మయ్య(58) తన భార్యతో కలిసి ఆదివారం దేవునిపల్లి లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అందుగులపల్లి గ్రామ స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా గోదావరిఖని నుంచి పెద్దపల్లి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. లక్ష్మయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందగా, అతడి భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు లక్ష్మయ్య భార్య వేముల మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మయ్య (ఫైల్)

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.



వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కథ-2023 సంకలనం ఆవిష్కరణ
- కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
- అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.



కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

హనుమకొండ జిల్లాలోని ఓ పత్తి చేనులో దుర్ఘటన .. ఇంటర్ విద్యార్థిని, యువ రైతు మరణం

ఐనవోలు/నెల్లికుదురు/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురువగా.. పిడుగుపాటు వల్ల హనుమకొండ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురానికి చెందిన కుకట్ల రాజుయాదవ్ (25) దౌతుబాజి శ్రావణి(17), కుకట్ల కోమల(రాజు యాదవ్ తల్లి) సహా ఏడుగురు కలిసి గ్రామ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరుతున్నారు. అయితే, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీ వర్షం పడడంతో అందరూ సమీపంలోని ఓ రేకుల షెడ్డు కిందకి వెళ్లారు. పది నిమిషాల వ్యవధిలో ఆ షెడ్డుపై పిడుగుపడగా అంతా స్పృహ కోల్పోయారు. కాసేపటికి తేరుకున్న కొందరు ఇతరులను లేపేందుకు ప్రయత్నించగా రాజుయాదవ్, శ్రావణి ప్రాణాలు కోల్పోయారు. రాజుయాదవ్ తల్లి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శ్రావణి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. యువ రైతు అయిన రాజు అవివాహితుడు. ఇక, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయంలో ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆర్.సింగారం సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సింగారం స్వస్థలం తమిళనాడులోని వెల్లూరు.. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింగారం పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.



రాజుయాదవ్



శ్రావణి (ఫైల్)

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, జనగాం, హనుమకొండ, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, జనగాం, వరంగల్, యాదాద్రి జిల్లాలకు సోమవారం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, ఆదివారం జనగామలో 3 సెంటీమీటర్ల వర్షపాతం కురవగా, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఆర్యవైశ్య పట్టణ సంఘం ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

వేములవాడ, అక్టోబరు 6: వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవికి ఆదివారం నామినేషన్లను స్వీకరించారు. ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం భవనంలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగగా అధ్యక్ష స్థానానికి సిద్ధంశెట్టి వేణు, ఎర్రం శ్రీనివాస్, ఐత వెంకటేశ్, ధైత సతీశ్ నామినేషన్లు వేశారని ఎన్నికల అధికారులు ఎల్లంకి శ్రీనివాస్, అల్లంకి శ్రీనివాస్ తెలిపారు. 7వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించి 13న ఎన్నిక నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చందుర్తి, అక్టోబర్ 6 : చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 -2004 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 21 ఏళ్ల క్రితం విడిపోయిన విద్యార్థులు ఒకే కలిసుకోవడంతో సందడి నెలకొంది. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

అనారోగ్యంతో తెలంగాణ ఉద్యమకారుడి మృతి

ఇల్లంతకుంట, అక్టోబరు 6: మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు గాలిపెల్లి గ్రామానికి చెందిన బొలుమాల రవీందర్ (45) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. గాలిపెల్లికి చెందిన రవీందర్ తెలంగాణ ఉద్యమ సమయంలో మండలంలో క్రియాశీలక పాత్ర పోషించారు. అనాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయనపై ఎనిమిది కేసులు నమోదు అయ్యాయి. రవీందర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రవీందర్ మృతికి పలువురు ఉద్యమకారులు సంతాపం తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గంభీరావుపేట, అక్టోబరు 6: గంభీరావుపేట మండల కేంద్రంలోని బరిగెలగూడెం కాలనీలో ఎస్‌టీఎఫ్ నిధుల ద్వారా మంజూరైన సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎడబోయిన ప్రభాకర్, కోట లింగం, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు ఉన్నారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

గంభీరావుపేట, అక్టోబరు 6: గంభీరావుపేట మండల కేంద్రంలో రెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంఘం భవన ఆవరణలో మహిళలు బతుకమ్మ ఆడారు. అనంతరం నమాజ్ చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

ఇసుక వాహనం బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ఎల్లారెడ్డిపేట ,అక్టోబరు 6: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాలీ ఆటో ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులో శనివారం అర్థరాత్రి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన వాహన డ్రైవర్ శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. శ్రీనివాస్ వాహనంలో ఇసుకను ఎల్లారెడ్డిపేట మీదుగా కామారెడ్డికి తరలిస్తున్న క్రమంలో పోలీసులను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. వాహనం వేగం పెంచడంతో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి ప్రమాదానికి గురైంది.

కోతుల గుంపును తప్పించబోయి ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 6: ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కోతుల గుంపు రావడంతో కిందపడి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో ఫైమద్ తన ద్విచక్రవాహనంపై స్థానిక డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం నుంచి గొల్లపల్లి బస్టాండ్ వైపునకు వెళ్తున్నాడు. ఒక్కసారిగా వానర మూక వాహనానికి అడ్డు రావడంతో తప్పించే క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

గోపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా లక్ష్మణ్‌గౌడ్

ముస్తాబాద్, అక్టోబరు 6: గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోపా) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్ నియామకమయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో తన బాధ్యతను మరింత పెంచిందని, గోపా సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చందుర్తి అక్టోబరు 6: చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో ఓ ఇంటిలో నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. సనుగుల గ్రామ శివారులోని గంగిరెద్దుల కాలనీ చెందిన కొందరు వ్యక్తులు గ్రామంలోని పలువురి ఇళ్లలో నిల్వ చేసిన బియ్యాన్ని సిరిసిల్ల, వేములవాడ తరలించేందుకు సిద్ధమయ్యారు. పట్టుకున్న బియ్యం దాదాపు 25 క్వింటళ్లకుపైగా ఉంటాయి. పట్టుకున్న బియ్యంను, ట్రాక్టర్ ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాపు తెలిపారు.

ముస్తాబాద్ రజక యూత్ అధ్యక్షుడిగా యాదగిరి

ముస్తాబాద్, అక్టోబరు 6 : ముస్తాబాద్ పట్టణ రజక యూత్ అధ్యక్షుడిగా తెర్లుమద్ది యాదగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దీటి కృష్ణకాంత్, కోశాధికారిగా మిరుదొడ్డి రాజు, ప్రధాన కార్యదర్శిగా మిరుదొడ్డి ఎల్లంను ఎన్నుకున్నారు. నూనత కార్యవర్గన్ని యత్ సభ్యులు దీటి నర్సింలు, దీటి రాజు, దీటి వెంకటేశ్, దీటి భరత్, రాహుల్ అభినందించారు.

వెలమ సంఘం అధ్యక్షుడిగా సురభి సత్యనారాయణ

ముస్తాబాద్, అక్టోబరు 6: ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామ పద్మనాయక వెలమ సంఘం అధ్యక్షుడిగా సురభి సత్యనారాయణను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సురభి దశరథరావు, ప్రధాన కార్యదర్శిగా సురభి రాధకిషన్‌రావు, కోశాధికారిగా సురభి రాజేశ్వర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దుర్గమ్మ బోనాలు

చందుర్తి, అక్టోబరు 6: చందుర్తి మండల కేంద్రంలో లయన్స్ యూత్ ఆధ్వర్యంలో దుర్గమ్మ బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దుర్గ మాత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గచ్చిబావి వద్ద ఏర్పాటు చేసిన మండపం నుంచి బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. భవాని దీక్ష పరులు, లయన్స్ యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

సనుగులలో బెల్ట్ షాపునకు వేలం

చందుర్తి, ఆక్టోబరు 6 : చందుర్తి మండలం సనుగులలో గ్రామ అభివృద్ధి పేరిట కొందరు బెల్ట్ షాపునకు శనివారం వేలం నిర్వహించగా ఆదివారం విషయం వెలుగు చూసింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. సనుగులలో గతంలో ఐదు బెల్ట్ షాపులు ఉండేవి. ఇటీవల కొందరు గ్రామ అభివృద్ధి పేరిట ఒక కమిటీని నియమించారు. బెల్ట్ షాపునకు వేలం నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులు రూ.లక్ష వరకు వేలం పాడి దక్కించుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. వేలం వేసి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్‌పై దాడి

వీర్నపెల్లి, అక్టోబరు 6 : డయల్ 100 కాల్ సమస్యను పరిష్కరించేందుకు వెళ్లిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్‌పై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన వీర్నపెల్లి మండలం జవహర్‌లాల్‌నాయక్ తండాలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గూగులోతు రవి తన భార్యతో గొడవ పడగా ఆమె 100కు ఫోన్ చేసింది. విధుల్లో ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. భార్యాభర్తల మధ్య గొడవకు మీరేందుకు వచ్చారంటూ మద్యం మత్తులో దూషిస్తూ కానిస్టేబుల్‌ను నెట్టివేశాడు. వీడియో తీస్తున్న ఫోన్‌ను పగులగొట్టినట్లు తెలిసింది. ఎస్సై ఎల్లాగౌడ్ అక్కడికి చేరుకోగా రవి తప్పించుకున్నాడు. ఈ విషయంపై ఎస్సైని వివరణ కోరగా డయల్ 100 సమాచారంతో గ్రామానికి చేరుకున్న పోలీసులను తాగిన మైకంలో రవి నెట్టివేసినట్లు పేర్కొన్నారు. విధుల్లో ఉన్న పోలీసుపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యతి నరసింహానందపై ఫిర్యాదు

గంభీరావుపేట, అక్టోబరు 6: ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌కు చెందిన యతి నరసింహానందపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని గంభీరావుపేట ముస్లింలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కొన్ని నెలలుగా మతపరమైన విమర్శలతో అభ్యంతరకరమైన పదాలను ఉపయోగిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేతన్నలకు ఉపాధి కల్పించే దిశగా ముందుకు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 6: నేతన్నలకు శాశ్వత ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. రూ.50 కోట్ల నిధులతో యారన్ డిపోను మంజూరు చేయడాన్ని హర్షిస్తూ ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సిరిసిల్ల నేతన్న విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ 30 సంవత్సరాలు సిరిసిల్ల వస్త్రపరిశ్రమ వర్గాలు ఎదురు చూస్తున్న యారన్ డిపో ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.50 కోట్లు నిధులు విడుదల చేయడం హర్షనీయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సిరిసిల్ల నేత కార్మికులను ఆదుకోవడం కోసం నాడు అంత్యోదయ కార్డులను, విద్యుత్ సబ్సిడీ అమలు చేస్తే గత ప్రభుత్వం వాటిని రద్దు చేసిందన్నారు. సిరిసిల్లలో యారన్ డిపో అమలు చేస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం విస్మరించి కంటితుడుపు చర్యలు చేపట్టిందని ఆరోపించారు. నేత కార్మికులకు ఉపాధి కల్పించడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్క పథకం అమలు చేస్తూ ముందడుగు వేస్తోందన్నారు. ఇందులో భాగంగానే వేములవాడ కేంద్రంగా యారన్ డిపోను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దీని ద్వారా ఆసాములు, కార్మికులకు ఎక్కువ శాతం లబ్ధి చేకూరుతుందన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడుతూ తమది చేతల ప్రభుత్వమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి నిరూపించారన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరల బకాయిలు పెట్టిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిలను చెల్లించి వస్త్ర పరిశ్రమకు, పవర్‌లూం కార్మికులకు అండగా నిలిచిందన్నారు. సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దుబాల వెంకటేశం, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆడెపు చంద్రకళ, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, కౌన్సిలర్ వేముల రవి, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు కాముని నళినీకాంత్, బైరినేని రాము, రాపెల్లి కళ్యాణ్, పీస్కు మధు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: రాజన్న సిరిసిల్ల జిల్లాకు యారన్ డిపోను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం హర్షనీయమని ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని నేతన్న విగ్రహం ఎదుట ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ యారన్‌బ్యాంక్‌ను జిల్లాకు మంజూరు చేస్తూ జీవోను విడుదల చేయడంతో ఆసాముల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసాముల సమన్వయ కమిటీ నాయకులు ఆడెపు సాగర్, కోడం రవి, పులి ఎల్లయ్య ఆనందం, వెంకటరమణ, దూస అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: నేతన్నల కలను సాకారం చేస్తూ వేములవాడలో ప్రభుత్వం యారన్ డిపోను ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. 30 ఏళ్లుగా నేత కార్మికులు ఎదురు చూస్తున్న యారన్ డిపోను కేటాయించడంతో స్థానికంగా ఉపాధి లభించనుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు రాజేందర్, నారాయణరెడ్డి, బాలయ్య, రవీందర్, లక్ష్మీబుచ్చాగౌడ్, గణపతి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, నాయకులు రాజునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, రవి, రఫీక్, నాగరాజు, పర్శరాములు, శ్రీపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, దేవరాజు, ఇలియాస్, అజయ్ పాల్గొన్నారు.





నేతన్న విగ్రహం వద్ద మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి, వేములవాడలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నేతన్నల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రూ.50 కోట్లు కేటాయించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందన్నారు. అందుకోసమే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు చిత్తుగా ఓడించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు పిట్ల వెంకటి, బంగళ రాజుగౌడ్, జంగం రాజు, ప్రభాకర్, శంకర్, కుమార్ తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వేములవాడకు యారన్ డిపో(నూలుడిపో)ను మంజూరు చేయడం పై నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యారన్ డిపో ఏర్పాటుకు రూ.50 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండం రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, అరుట్ల మహేశ్‌రెడ్డి, కరెడ్ల కొండల్‌రెడ్డి, తాళ్ల విజయ్‌రెడ్డి, తాడెపు కొమురయ్య, రాంచంద్రం, శ్రీకాంత్, కదిరె సత్తన్న మారుపాక శంకర్, రాగం నాగరాజు, నల్ల బుచ్చయ్య దాప మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో..

వేములవాడ: వేములవాడలో యారన్ డిపో ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక నేత కార్మికులు ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న నూలు డిపో ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 50 కోట్లతో వేములవాడ పట్టణంలో నూలు డిపో ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేసిన నేపథ్యంలో వేములవాడ చేనేత సహకార సంఘం కార్యాలయం నుంచి తెలంగాణ చౌక్ వరకు నేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేములవాడ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నూలు డిపో ఏర్పాటు చేయాలని చేనేత కార్మికులు పోరాటం చేస్తున్నారని, కానీ గత పాలకులు దీనిపై నిర్లక్ష్యం వహించారని అన్నారు. ఎట్టకేలకు సీఎం రేవంత్ రెడ్డి వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేసేందుకు 50 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. నూలు డిపో మంజూరు కోసం సహకరించిన స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడిపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కొక్కుల చంద్రయ్య, నాయకులు కొక్కుల బాలకృష్ణ, పారువెల్ల రాజేశం, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు అవధూత రజనీకాంత్, చేనేత సహకార సంఘాల సభ్యులు, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి: వేములవాడకు యారన్ డిపో (నూలు డిపో) మంజూరు చేసినందున మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపటి రామస్వామి, నాయకులు బొజ్జ మల్లేశం, గొట్టే ప్రభాకర్, ఏనుగుల కనకయ్య, భూమేష్, పద్మశాలి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేములవాడకు నూలు డిపో మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి పొన్నం ప్రభాకర్, బట్టి విక్రమార్క, దుద్దిల్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ వేములవాడ కేంద్రంగా నూలు డిపో ఏర్పాటు చేసి రూ.50 కోట్లు నిధులను కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు కృషి చేసిన మంత్రులకు కృతజ్ఞతలు 30 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మరమగ్గాల కార్మికుల చిరకాల వాంఛ నెరవేరిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చేపూరి గంగాధర్, గొట్టే రుక్మిణి, తాళ్లపెల్లి ప్రభాకర్, మండల నాయకులు నరసింహచారి, మానక సత్యం, బండ సత్తయ్య, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, అజీమ్, ఎర్ర రవి, మహేందర్, జాన్, రాజేశం, లవన్, శేఖర్, నాగరాజు, శ్రీధర్, ప్రభాకర్, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

రుద్రంగి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యారన్(నూలు) డిపోను రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఏర్పాటు చేయడంతోపాటు రూ.50 కోట్లు నిధులు మంజూరు చేయడంపై రుద్రంగి మండల కేంద్రంలోని ఇందిరా చౌక్ చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, చెలుకల తిరుపతి, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్, పిడుగు లచ్చిరెడ్డి, ఎర్రం ఆరవింద్, దసారి గంగారాజం, దయ్యాల శ్రీనివాస్, అట్టపల్లి మల్లేశం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



క్షీరాభిషేకం చేస్తున్న ఆసాములు



రుద్రంగిలో..

యారన్ డిపో సిరిసిల్లలో ఏర్పాటు చేయాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 6: వస్త్ర పరిశ్రమల కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన యారన్ డిపోను సిరిసిల్ల జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృతలాల్ శుక్లా కార్మిక భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగా సీఎం రేవంత్‌రెడ్డి యారన్‌డిపో మంజూరు చేయడాన్ని హర్షిస్తున్నామన్నారు. యారన్‌డిపో ఏర్పాటు చేయడం ద్వారా మరమగ్గాల పరిశ్రమలకు కొంత మేర పెట్టుబడి భారం తగ్గుతుందని, కింది స్థాయి యజమానులు, ఆసాములకు లబ్ధి చేకూరి స్వయం సమృద్ధి జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే యారన్‌డిపోను వేములవాడలో కాకుండా వస్త్ర పరిశ్రమలు అధికంగా ఉన్న సిరిసిల్లలోనే నెలకొల్పే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పనలో భాగంగా ఏర్పాటు చేసిన వర్కర్‌టు ఓనర్ పథకాన్ని ప్రారంభించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు నక్కదేవదాస్, సిరిమల్ల సత్యం, ఉడుత రవి, బెజుగం సురేష్, సందుపట్ల పోచమల్లు, బింగి సంపత్, స్వర్గం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 6: ఎల్లారెడ్డిపేట మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంతోపాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, నారాయణపూర్, వెంకటాపూర్, బండలింగంపల్లి, దుమాల, అల్మాస్‌పూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో అమ్మవారు ఆదివారం లలితాత్రిపురసుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు గ్రామాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఒడి బియ్యం పోసి పిల్లాపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు.

వేములవాడ టౌన్ : వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీదుర్గదేవి అమ్మవారికి అర్చకులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం నాలుగవ రోజున శ్రీ లలితా త్రిపుర సుందరి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. చిలివురి సత్తయ్య, బాబు నాంపల్లి గ్రామస్థులు ఉన్నారు.



నాంపల్లిలో అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

కార్మికుల సంక్షేమమే సీపీఎం లక్ష్యం

ఇల్లంతకుంట, అక్టోబరు 6: కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా సీపీఎం పని చేస్తోందని జిల్లా కార్యవర్గ సభ్యుడు గన్నేరం నర్సయ్య అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కార్యదర్శిగా సావనపెల్లి రాములు, కమిటీ సభ్యులుగా సామ నర్సింహ్మారెడ్డి, మంద అనీల్‌కుమార్, సొల్లు సాయి, పెండెల ఆదిత్య, గన్నేరం స్వామిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ నిరుపేదలకు ఇళ్లను ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. భూమిలేని నిరుపేదలకు భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

చందుర్తి అక్టోబరు 6: చందుర్తి మండలంలో మూడపెల్లి గ్రామంలో ప్రీమియం లీగ్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు మూడపల్లి గ్రామానికి చెందిన బద్దం తిరుమలరెడ్డి గెలుపొందిన జట్లకు షీల్డ్‌లు, మెమొంటోలు అందించనున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పుల్కం మధు, యాకోబ్, తిరుపతి నాయక్, హమీద్, సుబ్బు, అక్షయ్,విజేందర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్‌కు ఎంపిక

కోనరావుపేట, అక్టోబరు 6: కోనరావుపేట మండలం నిజామాబాద్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న మునీర్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి క్రికెట్‌కు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం షాబుద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ సుంకటి అజయ్ తెలిపారు. నిజామాబాద్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న మునీర్ మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిత్యం వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

10 శాతం యారన్ సబ్సిడీ ఇప్పించాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 6: సిరిసిల్ల పవర్ లూం కార్మికుల 10 శాతం యారన్ సబ్సిడీని బతుకమ్మ పండుగలోపు ఇప్పించాలని ఏఐటీయూసీ, లాల్ బావుటా చేనేత పవర్‌లూం కార్మిక సంఘం సంయుక్తంగా కోరింది. ఆదివారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, లాల్ బావుటా చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన యారన్ బ్యాంక్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. యారన్ బ్యాంక్ ఏర్పాటుకు కృషి చేసిన కేకే మహేందర్‌రెడ్డికి కార్మికుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. యారన్ బ్యాంక్‌తో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధి జరుగుతుందని, ఆసాములు నేరుగా వ్యాపారం చేయడంతో కార్మికుల వేతనాలు కూడా పెరిగే అవకాశం ఉందని అన్నారు. గత ప్రభుత్వం తప్పిదాలతో సిరిసిల్ల ప్రాంతంలోని కార్మికులకు ఎనిమిది నెలలుగా ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం కార్మికుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని 10 శాతం యారన్ సబ్సిడీని బతుకమ్మ పండుగలోపే విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్తామని కేకే మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు చెప్పారు. నాయకులు దూస రమేష్, మోర మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కత్తెర దేవదాస్, నాయకులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మైక్రో ఫైనాన్స్‌ల దౌర్జన్యాలపై సీఎంకు నివేదిస్తాం

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 6: మైక్రో ఫైనాన్స్‌ల దౌర్జన్యాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌లోని ఆర్ఎంపీ భవనంలో ఆదివారం ఐద్వా 3వ జిల్లా మహాసభలను ప్రారంభించారు. అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం మహాసభలో మాట్లాడుతూ జిల్లాలో బంధన్, మైక్రో ఫైనాన్స్‌ల బలవంతపు వసూళ్లు నిలిపివేయాలని, అధిక వడ్డీ వసూలు చేస్తున్న మైక్రో ఫైనాన్స్‌లపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి నేత కార్మికులు ప్రైవేటు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను రద్దు చేయాలని, ఇళ్లులేని నిరుపేదలందరికీ వెంటనే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. బంధన్ బ్యాంక్, మైక్రో ఫైనాన్స్ యాజమాన్యం పవర్‌లూంలు ప్రారంభమయ్యే వరకు ఆరు నెలల పాటు రుణాల వసూలు నిలిపివేయాలన్నారు. బలవంతంగా రుణాలు వసూలు చేయడానికి వస్తే అడ్డుకుంటామన్నారు. మహిళలకు ఉపాధికల్పన కోసం జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బెల్ట్‌షాపులను తొలగించడంతోపాటు మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నట్లుగా ప్రకటించారు. అధ్యక్షురాలిగా సూరం పద్మ, ప్రధాన కార్యదర్శిగా విమల, ఉపాధ్యాకులుగా పూజ్యం జనదేవలక్ష్మీ, ఎండీ రెహమాన, డాకూరి కల్పన, పూజ, సహాయ కార్యదర్శిగా సామల కవిత, వడ్లలక్ష్మీ, బోనాల లక్ష్మీ ఎన్నికైనట్లు పేర్కొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి